సోలార్ ప్రాజెక్ట్ వల్ల ఉపాధిని కోల్పోతున్నాం

● వద్దిరాల గొర్రెల కాపరుల ఆవేదన

మైలవరం : మండలంలోని వద్దిరాల సమీపంలో నిర్మితమవుతున్న సోలార్ పవర్ ప్రాజెక్ట్ గొర్రెల కాపరుల జీవనోపాధికి గొడ్డలి పెట్టుగా మారిందని వద్దిరాల గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వారు 'సాక్షి'తో మాట్లాడుతూ తరతరాలుగా తాము కొండను నమ్ముకుని బ్రతుకుతున్నామని ఇప్పుడు ఆ కొండే సోలార్ పరమతై మాకు ఉపాధి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

తమ గ్రామాన్ని ఆనుకుని ఉన్న డొడియం కొండలో మేం గొర్రెల దొడ్లు వేసుకుని కొండల్లో గొర్రెలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. ఇప్పుడు కొండ అంత సోలార్ ప్రాజెక్ట్ కోసం చదును చేశారని, చివరకు గొర్రెల డొడ్లను సైతం తోలగించాలంటూ హుకుం జారీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క వద్దిరాల గ్రామంలోనే 4 వేల గొర్రెలు ఉన్నాయని 50 నుంచి 60 కుటుంబాలు పోషణగా ప్రధాన వృత్తిగా జీవిస్తున్నామన్నారు. ప్రస్తుతం 3 వేల ఏకరాల కొండను సోలార్ ప్రాజెక్ట్ కొరకు తయారు చేస్తున్నారని కేవలం 300 ఏకరాలు మాత్రం గొర్రెల పోషణ కోసం మిగిలించాలని వారు కోరుతున్నారు. తమ విజ్ఞప్తిని ప్రభుత్వం మన్నించి తరతరాలుగా వస్తున్న తమ వృత్తికి కుటుంబ జీవనోపాధికి భంగం కలగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.



వద్దిరాల కొండలో కంపను కంచెగా గొర్రెల దొడ్డిని ఏర్పాటు చేసుకున్న కాపరులు



వద్దిరాల కొండలో మేత మేస్తున్న గొర్రెలు

జీవనోపాధిని పూర్తిగా కోల్పోతున్నాం



మా నాన్న అబ్బ కాలం నుంచి గొర్రెల పోషణ మా ప్రధాన వృత్తి. తరతరాలుగా గొర్రెలను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. అలాంటిది ఇప్పుడు ఉన్నపళంగా కొండను ఖాళీ చేయావలసి వస్తుంది. గొర్రెలను మేపుకోవడానికి స్థలమే లేదు. కొండంత సోలార్ వారు ఆక్రమించుకుంటున్నారు. చివరకు కొండల్లో ఓ మూలన మేం ఏర్పాటు చేసుకున్న దొడ్లను సైతం తోలగించడానికి సిద్ధం ఆవుతున్నారు. గొర్రెల పోషణ కొరకు కొంత స్థలాన్ని వదలిపెట్టి మిగిలిన కొండల్లో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసుకుంటే ఎవరికి అభ్యంతరం లేదు.

– అల్లరాజు గంగరాజు, గొర్రెల కాపరి, వద్దిరాల

గొర్రెల దొడ్లను తొలగిస్తున్నారు



పగలంతా వివిధ ప్రాంతాలకు వెళ్లి గొర్రెలను మేపుకుని రాత్రి వాటిని పడుకోబెట్టడానికి కొండలో ఓ మూలన దొడ్లను ఏర్పాటు చేసుకున్నాం. చుట్టూ కంపను కంచెగా పెట్టి దొడ్లను ఏర్పాటు చేసుకుంటే వాటిని తొలగించాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? గొర్రెల దొడ్లను తోలగిస్తే రాత్రి పూట మా గొర్రెలను ఎక్కడ పడుకోబెట్టుకోవాలి? గొర్రెలను మేం ఉన్న పళంగా అమ్మితే మాకు జీవనోపాధి ఏట్లా? ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– వెంపలాకు చిన్న రాజు, గొర్రెల కాపరి, వద్దిరాల

కూటమి ప్రభుత్వానికి మతిభ్రమించింది

– వాల్మీకి సంఘు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి

పులివెందుల టౌన్ : కూటమి ప్రభుత్వానికి మతిభ్రమించిందని, ఇష్టానుసారంగా కుల నిర్ధారణ లేకుండా పదవులు కట్టబెట్టడం చాలా దారుణమని, వాల్మీకులను కించపరచడం కూటమి ప్రభుత్వానికి న్యాయమేనా అని వాల్మీకి సంఘు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నారాయణస్వామి అన్నారు.

ఆదివారం పట్టణంలోని స్థానిక వైఎస్ పాల్‌రెడ్డి పంక్షన్ హాలు సమీపంలోని వాల్మీకి సంఘు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏకి నాయుడులను వాల్మీకి సంఘు కార్పొరేషన్ చైర్మన్ చేయడం సిగ్గు చేటు అన్నారు. రాష్ట్రంలో వాల్మీకులు 60 లక్షల మందికి పైగా ఉన్నప్పటికీ కప్పట్రాల సుశీలమ్మ ఆలియాజ్ (బుజ్జమ్మ)కు చెర్మన్ పదవి ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వాల్మీకులను కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం, వారిని అవమానపరిచి కించపరచడమేనన్నారు. పదవులు ఇచ్చేటప్పుడు వారి బయోడేటా చూసి పదవులు కట్టబెట్టాలే కానీ, గుడ్డిగా పదవులు కట్టబెట్టడం కూటమి ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో వాల్మీకి బోయలు లేరా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన చైర్మన్ పదవిని ఉపసంహరించి స్వచ్ఛమైన వాల్మీకులకు పదవి కట్టబెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తప్పుడు నిర్ణయాలు తీసుకోవడంతో రాష్ట్రంలోని వాల్మీకుల మనోభావాలు దెబ్బతీశాయన్నారు. ఏకి నాయుడులు మేము వాల్మీకులం కాదని స్పష్టంగా ఒక ఇంటర్వ్యూలో చైర్మన్ పదవి ఇచ్చిన బుజ్జమ్మ చెప్పడం జరిగిందన్నారు. ఇప్పుడు ఇచ్చిన 59 మంది కార్పొరేషన్ల చైర్మన్ పదవులను వాళ్ల కుల ధృవీకరణ పత్రాలు పరిశీలించి పదవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అటవీ సిబ్బంది ప్రాణత్యాగం చిరస్మరణీయం

ముద్దనూరు : విధినిర్వహణలో అటవీ శాఖ సిబ్బంది ప్రాణత్యాగం చేయడం చిరస్మరణీయమని ముద్దనూరు డివిజన్ ఫారెస్టు రేంజి అధికారి అశోక్‌యాదవ్, స్థానిక సీఐ దస్తగిరిలు తెలిపారు. ఆదివారం స్థానిక ఫారెస్టు కార్యాలయంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ అటవీ సంపద రక్షణ కోసం ఉన్నతస్థాయి నుంచి క్రింది స్థాయి సిబ్బంది అమరులయ్యారని, వారికి ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. సీఐ మాట్లాడుతూ విధినిర్వహణలో పోలీసులు, అటవీ శాఖాధికారుల సేవలు వెలకట్టలేనివని, శాంతిభద్రతలు, అటవీ సంపద రక్షణలో భాగంగా ప్రాణాలు త్యాగం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



సంస్మరణ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో, సీఐ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

తొండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1985–86 పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక చోట చేరి గత అనుభవాలను నెమరువేసుకున్నారు. 38 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకుని వారి జీవన స్థితిగతులు పంచుకుని ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమిరెడ్డి వెంకట్రామిరెడ్డి, శ్రీరామిరెడ్డి, టిసి గంగిరెడ్డి, అశ్వర్థరెడ్డి, జి.కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రోగ్రాం ఆర్గనైజర్ మల్లెల రామకృష్ణారెడ్డి, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు

వేంపల్లె : ఓ అనాథ మృతదేహానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు వచ్చి అంత్యక్రియలు చేసింది. ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నాలుగు రోజుల నుంచి ఓ అనాథ వృద్ధుడు (62) చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆసుపత్రి సిబ్బంది మానవత సంస్థకు సమాచారం అందించారు. మానవత సంస్థ సభ్యులు ఆ అనాథ మృతదేహం వద్దకు చేరుకున్నారు. అలాగే స్థానిక ఎస్ఐ రంగరావుకు విషయం తెలియజేసి అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో మానవత అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని శివాల్‌పల్లి గ్రామానికి చెందిన కొండారెడ్డి శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసిన కమలాపురం మాజీ ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మృతుడి స్వగృహానికి వెళ్లి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బారెడ్డి బ్రదర్స్ ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ప్రత్యూష

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక పాత బస్టాండు సమీపంలోని రమణప్ప సత్రంబడి పాఠశాలలోని 86, 87 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆర్డీఓ ప్రత్యూష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజులు పాటు ఓటు నమోదు చేసుకునేందుకు వీలుగా రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు తమ ఓటును నమోదు చేయించుకోవాలన్నారు. తహసీల్దార్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం కో ఆర్డినేటర్‌గా ధృవకుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా వేంపల్లెకు చెందిన మూలం ధృవకుమార్‌రెడ్డిని నియమించారు. పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధృవకుమార్‌రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : మండలంలోని మురారిచింతల, అంబకపల్లె, హిరోజీపురం, మురారిచింతల విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈలు రమేష్‌బాబు, బాల సంజీవులు తెలిపారు. రైతులు గమనించి సహకరించాలన్నారు.

ఉర్దూ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో పీడీ షాహీన్

వేంపల్లె : 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 రగ్బీ పోటీలలో వేంపల్లె జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్ తెలిపారు. ఇటీవల కమలాపురంలో జరిగిన ఈ రగ్బీ బాలికల పోటీల విభాగంలో పి.బిందుమాధవి రెండవ స్థానం, బాలుర విభాగంలో ఎస్.నూరుల్లా మూడవ స్థానంలో నిలిచారన్నారు. హెడ్మాస్టర్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్లు సీవీఎస్ రాయుడు, ఎస్.షాహీన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

వృద్ధులకు పింఛను పెంచకపోవడం దారుణం

– ఆల్ పెన్షనర్ల రిటైర్డ్స్ ఆసోసియేషన్ జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఆల్ పెన్షనర్ల రిటైర్డ్స్ ఆసోసియేషన్ జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి

పులివెందుల టౌన్ : దేశం ఆర్థికంగా ఎదగడం కోసం అప్పటి పరిశ్రమలలో, ప్రభుత్వ సంస్థలలో పనిచేసిన కార్మికులకు ఇప్పటికీ పింఛన్ పెంచకపోవడం దారుణమని ఆల్ పెన్షనర్స్, రిటైర్డర్స్ అసోసియేషన్ కడప జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సాహితి స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లా కుమారస్వామిలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సత్రంబడి పాఠశాల ఆవరణలో పెన్షనర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న కర్మాగారాలు, పరిశ్రమలలో పనిచేసి దేశ అభివృద్ధికి పనిచేసిన కార్మికులకు ఇప్పటికీ పాలకులు పింఛన్ పెంచకపోవడం దారుణమని.. పాలకుడు పదవి కాలంలో జీతం తీసుకుని, మళ్లీ పదవి పూర్తైన తర్వాత రూ.10 వేలకు పైగా పింఛన్ తీసుకుని సుఖంగా ఉంటున్నారే తప్ప దేశ సంపద కోసం శ్రమించి పనిచేసి వృద్ధాప్యంలో కష్టాలు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక సాయం పెంచకపోవడం పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. ప్రస్తుతం రూ.8వేలు ఇస్తున్న పింఛన్‌ను దాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూ.9 వేలకు పెంచాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏ ఇవ్వాలని, ఆర్ఓసీని తిరిగి పునరుద్ధించాలని, పెన్షన్ లెక్క కట్టే విధానాన్ని మార్చాలన్నారు. ఈనెల 18వ తేదీన కడపలోని ఈపీఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్యం నాయకులు శివారెడ్డి, జిల్లా కోశాధికారి హరిచంద్రరెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ పులివెందుల నాయకుడు పాపిరెడ్డి, పులివెందుల కార్యదర్శి గపూర్, పెన్షనర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణం కోసం విరాళం

పులివెందుల టౌన్ : పట్టణంలో నూతనంగా నిర్మించనున్న స్నేహిత అమృతహస్తం సేవా సమితి కార్యాలయ భవనానికి ఆదివారం నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ రూ.10,116ల నగదును విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ స్నేహిత అమృతహస్తం సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలకు గానూ సొంత భవనం అవసరమని భావించి తన వంతు సాయంగా ఈ మొత్తాన్ని అందజేశానన్నారు. మరింతమంది సహాయ సహకారాలు అందించాలని ఆయన కరారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ నుంచి నగదును అందుకుంటున్న రాజు

ఉచిత వైద్య శిబిరం

ముద్దనూరు : స్థానిక డాక్టర్ బాలనారాయణరెడ్డి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. స్థానిక వైద్యులు నవజ్యోత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని హారిక హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణులు రోగులను పరీక్షించి చికిత్సలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు రమేష్

గంగమ్మకు ఘనంగా పూజలు



వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలో ని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం జిల్లాలోని వి విధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గంగమ్మ ఆలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలదండలతో అలంక రణ చేశారు. భక్తులు ఘనంగా పూజలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేసి తమ ఇష్ట దైవాన్ని దర్శనం చేసుకున్నారు. భక్తులు అమ్మవారికి కానుకలను, ముడుపులను సమర్పించుకున్నారు.

బియ్యం దందా.. కట్టడి కాదా !

● యథేచ్ఛగా సేకరణ.. అక్రమరవాణా



ఇళ్ల వద్ద రేషన్ బియ్యం సేకరిస్తున్న దృశ్యం



గతంలో పట్టుబడిన రేషన్ బియ్యం ఆటో (ఫైల్)

కొండాపురం : పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయవనరుగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. జమ్మలమడుగులోని ఓ రైస్‌మిల్‌కు, తాడిపత్రి పట్టణాలకు రేషన్ బియ్యం తరలిస్తున్నారు. రేషన్ బియ్యం స్టాక్‌పాయింట్లు ఎర్పాటు చేసి జోరుగా బియ్యం దంతా వ్యాపారం జరుగుతోంది. ప్రతి నెలా అక్రమ మార్గంలో సేకరించిన టన్నుల కొద్ది బియ్యాన్ని మిల్లులకు తరలించి పాలిష్ పట్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బియ్యం సేకరణ, నిల్వలు తరలింపు విషయాలు రెవవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినా లంచాలు తీసుకుని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కూలీల ద్వారా సేకరణ

బియ్యం సేకరణ కోసం వ్యాపారస్తులు కూలీలను ఏర్పాటు చేసుకున్నారు. వారు ఇంటింటికి వెళ్లి కిలో బియ్యం రూ.15 నుంచి 18 చొప్పున సేకరిస్తున్నారు. ఇతర మండలం ఎల్లనూరు నుంచి కూలీలు రేషన్ బియ్యంకు అధిక ధర రూ.20 లేదా 21 పెట్టి ఇళ్లవద్దకొనుగోలు చేస్తుంటే గ్రామాల్లోని స్థానిక కూటమి కార్యకర్తలు మా గ్రామంలో రేషన్ బియ్యం పెట్టితే పోలీసులకు పట్టిస్తామని అక్రమ రేషన్ బియ్యం వ్యాపారంకు పోటీ పడుతున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని స్టాక్ పాయింట్ వద్ద రూ.23 నుంచి 25 ప్రకారం వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారు. కొండాపురం, పొట్టిపాడు, దత్తాపురం, తాళ్లప్రొద్దుటూరు గ్రామాల్లో అక్రమ రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తుల ఇళ్లలో స్టాక్ పెట్టుకుని రాత్రి వేళ ఆటోల్లో తరలిస్తున్నారు.

● మాముళ్ల మత్తులో అధికారులు బియ్యం దందాను అరికట్టాల్సిన రెవెన్యూ పోలీసు, పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక పక్క ప్రభుత్వం రేషన్‌బియ్యం వ్యాపారంపై కొరడా ఝుళిపిస్తున్నా అధికారులు ఉదాసీనంగా ఉన్నారు. కొండాపురం మండలంలోని గ్రామాల్లో బియ్యం సేకరణ నుంచి రవాణా వరకు ప్రతి విషయం తెలిసినా దాడులు చేమడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వ్యాపారుల నుంచి పోలీస్ శాఖకు మాముళ్లు ముడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు



అయ్యప్ప భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీమిట్టమ నేశ్వరస్వామి దేవస్థానంలో రాగిమానుపల్లె గ్రామ సర్పంచ్ గజ్జెల అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం 700 మంది అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై అయ్యప్ప భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం ఆయన ఆలయానికి వెళ్లి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దోమకాటుతో ఆరోగ్యానికి చేటు



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

పులివెందుల రూరల్ : దోమలు కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని నగరిగుట్టలో సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో ఆయన విద్యార్థులకు ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు వచ్చినప్పుడు దగ్గరలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఊటుకూరు రింగ్ రోడ్ సర్కిల్



రింగ్‌రోడ్డు సర్కిల్‌లో వెలుగని వీధి దీపాలు

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : కడప–కర్నూలు జాతీయ రహదారిపై కడప కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఊటుకూరు రింగ్ రోడ్ సర్కిల్ వద్ద విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. సర్కిల్లోని సుమారు 8 ఫ్లడ్ లైట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల రాకపోకలకు ప్రయాణికులకు జంక్షన్‌గా ఉపయోగపడుతుండటంతో ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. అలాగే జాతీయరహదారిపై సమీపంలోని మూలవంక గ్రామం నుంచి రాజరాణి కల్యాణ మండపం వరకు కూడా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ దీపాలను రిపేర్ చేయాలని మూలవంక గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పులివెందుల రూరల్ : పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో పులివెందుల కడప జిల్లా సీఐటీయూ అనుబంధం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రాజమణి, సీఐటీయూ కార్యదర్శి గపూర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఆశావర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజామణి, గపూర్‌లు మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు వారి చేయాల్సిన పనిని కూడా ఆశా వర్కర్లను చేయమని ఒత్తిడి తీసుకురావడం, ఏఎన్ఎంలు చేయాల్సిన పనులు కూడా ఆశా వర్కర్లతో చేయించడం మానుకోవాలన్నారు. అనంతరం పులివెందుల ఆశా వర్కర్ల యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు లలిత, సునంద, కమిటీ సభ్యులుగా పద్మావతి, వెంకటేశ్వరమ్మ, ఇందిరా, ప్రమీల, శివనారాయణమ్మ, ప్రభావతి, సంజమ్మ, రాధ, అరుణ, చంద్రకళ, సురేఖ, భారతి, నాగరత్నమ్మలను ఎన్నుకున్నారు.

ఉత్సాహ భరితంగా రగ్బీ పోటీలు

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. రెండు రోజులుగా రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 400 మంది క్రీడాకారులతో క్రీడా మైదానం హోరెత్తించింది. అలాగే ఈ ప్రాంతంలో రగ్బీ క్రీడా నిర్వహణ మొదటి సారి కావడంతో స్థానికులు, విద్యార్థులు, క్రీడాకారులు చూసేందుకు ఆసక్తి చూపారు. బాల బాలికలు వేరు వేరుగా రగ్బీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు జరిగిన రెండు రోజులు ఆ ప్రాంతం క్రీడాకారులు, క్రీడాభిమానులతో ఉత్సాహంగా కనిపించింది.